C.P. Brown ACADEMY సి.పి.బ్రౌన్ అకాడమీ - నవ్యవీక్లీ ఉగాది కథలపోటీలో
ద్వితీయ బహుమతి రూ. 8,000 పొందిన కథ

## నేను

''కర్నూలు వరద బాధితుల కోసం మీ 'కొల్లీగ్స్' కొందరు విరాళాలిస్తున్నారు. మీరు కూడా ఎంతోకొంత ఇవ్వొచ్చు కదా?'' ఆ ప్రశ్నకు నా సమాధానం ఎలా ఉంటుందో తెల్సికూడా అడిగింది సంయుక్త. పది రోజుల క్రితం, షూటింగ్ కోసం స్విట్జర్లాండ్ వెళ్ళినప్పుడు కొన్న ఖరీదైన గాగుల్స్ ముఖం మీద సరిగ్గా అమరేలా పెట్టుకుని సంయుక్త వైపు తిరిగి ''నీకు తెలుసు, నాకిలాంటి 'షో' - వ్యవహారాలు నచ్చవని. అయినా ఎవరో ఒకరిద్దరు హీరోలు రిలీఫ్‌ఫండ్‌కి చెక్కు లిచ్చారని నేనూ ఇవ్వాలని రూలేం లేదు'' అన్నాను. సంయుక్త ఏమీ మాట్లాడ లేదు. కొన్నిక్షణాల మౌనం. తర్వాత నేనే మళ్ళీ అన్నాను. ''..ఈ విరాళాలన్నీ నిజంగా బాధితులకి చేరతాయంటే నేను నమ్మను. నాయకులూ, అధికార్లు, మధ్యవర్తులూ... వీళ్ళే మింగేస్తారు''. నా 'ఇవ్వక పోడాన్ని' సమర్థించుకునేందుకే అలా మాట్లాడేనని ఆమెకు తెలుసు. అప్పుడు కూడా సంయుక్త ఏమీ మాట్లాడలేదు. ''ఇవేళ షూటింగ్ రామోజీఫిల్మ్‌సిటీలో. వెళ్తున్నాను. బై'' చెప్పి, పోర్టికోలో నా కోసం ఎదురుచూస్తున్న బెంజ్‌లో కూర్చున్నాను. డోర్ మూసుకోగానే డ్రైవర్ కారుని ముందుకు పోనిచ్చాను.

# అందనంత ఎత్తులో!



- గుమ్మడి రవీంద్రనాథ్

కష్టపడి స్వశక్తితో సంపాదించిన దేదీ, ఉచితంగా ఆయాచితంగా ఎవ్వరికీ ఇవ్వకూడదన్న నా ధోరణి చూసి నన్నోపెద్ద 'మెటీరియలిస్ట్'గా అనుకుంటుంది నా భార్య సంయుక్త. నాకు పూర్తిగా భిన్నమైన మనస్తత్వం ఆమెది. తెలుగు చలనచిత్ర రంగంలో నేనొక 'స్టార్'గా వెలుగొందుతున్నా, ఈ గ్లామర్ ప్రపంచం అంటే ఆసక్తి లేదామెకు. ఆమెది పూర్తిగా వేరే ప్రపంచం. నగర శివార్లలో నాచారం దగ్గర, ఏడెకరాల స్థలంలో దాదాపు ఐదువందల రకాల మొక్కల్ని పెంచి, పచ్చని ప్రపంచాన్ని సృష్టించిందామె. నర్సరీల్లోవే కాక, ఆయుర్వేదం, అరోమా, హైబ్రిడ్ బోన్సాయ్, ఆర్కిడ్స్ లాంటివి ఎన్నో పెరుగుతున్నాయక్కడ. మొక్కల సేకరణా, పెంపకం, అభివృద్ధి పరచడం కాక, రంగురంగుల పక్షులూ, చెంగుచెంగున ఎగిరే కుందేళ్ళ సంరక్షణా చేపట్టింది. స్కూలు విద్యార్థులకు ఉచితంగా మొక్కల్ని పంచుతూ, కాంక్రీట్ జనారణ్యంగా మారిపోతున్న నగరానికి వనాభివృద్ధి గురించిన అవగాహన కలిగిస్తుంది.

ఈ విషయంలో నేనస్సలు జోక్యం చేసుకోను. ఆమె అభిరుచికీ అడ్డూ పడను. ఎందుకంటే, ఆ ఏడెకరాల భూమి సేకరణకు అయిన ఖర్చు, వ్యాపారవేత్త అయిన ఆమె తండ్రే భరిం

చాడు! ఆమె అభిరుచి పద్దుక్రింద నేను ఒక్క రూపాయి కూడా ఆమెకు ఎప్పుడూ ఇవ్వలేదు!! అదీ అసలు కారణం.

మా ఇద్దరి మధ్యా ఒక్క విషయంలోనే అభిప్రాయభేదాలు వస్తూ ఉంటాయి. అది డబ్బు విషయమే.

చలనచిత్ర రంగంలో అందరికన్నా నేనే ఎక్కువ సంపాదించాలి. ఏ హీరో దగ్గరా లేనంత డబ్బు నా దగ్గరుండాలి. సంపద విషయంలో నేను శిఖరాగ్రాన ఉండాలి. నా ప్రతి ఆలోచనా, ప్రతి అడుగూ ఆ దిశలోనే! సంయుక్తకేమో 'మనకు ఇంత ఉంది కదా, లేనివాడికి కాస్త సాయపడదాం' అనే తత్వం. నాది 'అందుకోవా'లనే ఆరాటం, ఆమెకు 'పంచాల'నే తపన. నా ఈ డబ్బు - ఆరాటం అసమంజసమేమీ కాదనటానికి నా వాదన నాకుంది. అదేంటంటే - వెండి చెంచా నోట్లో పెట్టుకుని పుట్టిన వాడినేం కాదు నేను. గుడివాడ దగ్గరి ఓ మారుమూల పల్లెలో చాలా నిరుపేద కుటుంబంలో పుట్టి, సినిమా వ్యామోహంతో నగరానికి వచ్చాను. తిండి లేక కుళాయినీళ్ళతో కడుపు నింపుకున్న ఎన్నో నిద్రలేని రాత్రులు. గది అద్దె చెల్లించే డబ్బు,



లేక ఎన్నోసార్లు రక్తం అమ్ముకున్నాను. ఎన్నో తిరస్కారాలు. మరెన్నో అవమానాలు. అన్నీ భరించాను. క్రమంగా, అసిస్టెంట్ డైరెక్టర్నై, జూనియర్ ఆర్టిస్టునై, విలన్ఐ, ఆఖరికి హీరో స్థాయికి చేరుకున్నాను. ఈ ఎదుగుదల క్రమంలో, డబ్బు విలువ బాగా తెలిసొచ్చింది. అందుకే నాలో ఓ కసి. ఏ డబ్బులేక విలవిలలాడి పోయానో, దాన్ని నా సొంతం చేసుకోవాలి. ఎవ్వరూ ఊహించని ఎత్తుకి ఎదిగిపోవాలన్న ఆరాటం!! నాలుగున్నర మిలియన్ల విలువైన ఇల్లూ, హీటెడ్ స్విమ్మింగ్ పూల్, మేపుల్ వుడ్ ఫ్లోరింగ్ గదులూ, బూర్జు దుబాయ్ నూట ఇరవయ్యవ అంతస్తులో రెండు ఫ్లాట్లూ, మెర్సిడెస్ బెంజ్, న్యూల్యాంబర్కి 6496 సి.సి. కార్... అన్నీ పొందాను!! అయినా తృప్తి లేదు. ఇంకా పొందాలన్న తపనే! సంయుక్తలో దానగుణం ఎక్కువ. తెలివైనవాడ్నీ, ప్రాక్టికల్ థింకింగ్ ఉన్నవాడ్నీ గనుక, ఆమె దానగుణం నాకు మూర్ఖత్వంలా తోస్తుంది!!

### అమృత్

సౌభాగ్య రెసిడెన్సీ.

ముప్పై ఫ్లాట్లున్న ఆ అపార్ట్మెంట్ రెండో అంతస్తులోని 203లో ఉండే వరప్రసాద్, మాన్వితల ఒక్కగానొక్క కొడుకు పన్నెండేళ్ళ అమృత్ స్కూల్ నుండి ఇంటికొచ్చి పుస్తకాల సంచి టేబిల్ మీద పెట్టి, ''ఇప్పుడే వస్తా మమ్మీ'' అని తల్లితో చెప్పి హడావుడిగా బయటకు వచ్చాడు. క్రింద గ్రౌండ్ ఫ్లోర్లో వాచ్మాన్ దగ్గరుండే పొడుగాటి కర్ర నొకదాన్ని తీసుకుని, అపార్ట్మెంట్చుట్టూ ఉండే ప్రహరీగోడ ఎక్కాడు. ఆ గోడ మీదుగా కరెంటు తీగలున్నాయి. గాలిపటం దారం కాళ్ళకు చుట్టుకుని, ఆ తీగల మీద తలక్రిందులుగా వేలాడుతున్న ఒక తెల్లపావురాన్ని ఇందాక స్కూల్ నుండి వస్తూ చూసాడు అమృత్. దాన్నెలాగైనా రక్షించాలని వాడి ప్రయత్నం. ఆ కాంపౌండ్ వాల్ మీద నిలబడి, కర్రతో ఆ దారాన్ని తెంచాడు. దారం లుంగలు చుట్టుకోవడంతో, ఎగర్లేక రెక్కలు టపటప కొట్టుకుంటూ క్రింద పడిపోయిందా పావురం. దాని చిట్టి కళ్ళల్లో భయం, నిస్సహాయత, బాధ. అమృత్ జాగ్రత్తగా గోడ దిగి, దాని దగ్గరకు పరిగెట్టుకు వెళ్ళాడు.

సున్నితంగా, ఆ పావురాన్ని చేతుల్లోకి తీసుకుని కాళ్ళకు చుట్టుకు పోయిన దారం చిక్కుల్ని విడదీసాడు. దాని రెక్కల కెక్కడైనా గాయమయిందేమోనని చూసాడు. అదృష్టవశాత్తూ అది చైనాదారం కాదు. రెక్కలు తెగలేదు. దాని ముఖాన్ని తన ముఖం దగ్గరగా పెట్టుకుని, ''వెళ్ళి పోతావా మీ ఫ్రెండ్స్ దగ్గరికి?'' అంటూ దాన్తో మాట్లాడి, రెక్కల మీద ముద్దుపెట్టుకుని గాలిలోకి వదిలేసాడు. కొత్తశక్తితో, రెక్కల్ని ఆడిస్తూ ఆకాశంలోకి దూసుకుపోతున్న దానివైపు ఆనందంగా చూస్తుండి పోయాడు. తిరిగి

ఇంట్లోకి రాగానే మాన్విత అడిగింది కొడుకుని, ''ఎక్కడికెళ్ళావ్‌రా అమృత్?'' అని. తను చేసింది తల్లికి చెప్పాడు అమృత్. ''కాంపౌండ్ వాల్ ఎక్కావా కాలుజారి పడితే ఇంకేమైనా ఉందా?'' అంటూ చాలా ఆందోళనపడింది మాన్విత, ''... నీకేం కాలేదుగా?'' అంటూ కొడుకు శరీరాన్ని ప్రేమతో తడిమింది.

''నాకేం కాలేదు మమ్మీ'' అంటూ సంతోషంగా చిరునవ్వు నవ్వుతూ చెప్తున్న కొడుకు వైపే తదేకంగా చూస్తోంది మాన్విత.

ఎందుకోగానీ, అమృత్‌కి ఆ లేతవయసులోనే చాలా పెద్ద ఆలోచన లొస్తుంటాయి. ఆ ఈడుపిల్లల్లో ఎవరిలోనూ కనపడని ఓ అపురూపమైన గుణం వాడికుంది. ఏదైనా సరే, 'తనకోసం' అంటూ ఆలోచించడు. అన్నీ 'కావాలి' అనుకోడు. 'ఇవ్వాలి' అనుకుంటాడు! తినేదైనా, ఆడుకునే బొమ్మలైనా, వేరేవాళ్ళకు పంచడంలో, ఇవ్వడంలో ఎక్కువ ఆనందం పొందుతున్నట్టుగా ఉంటుంది వాడి ధోరణి.

రోడ్ మీద చొక్కాలేకుండా చలికి వణుకుతూ భిక్షమెత్తుకుంటున్న పన్నెండేళ్ళ వికలాంగ బాలుడికి తను వేసుకునే చొక్కాల్లోది ఒకటి ఇచ్చేసి, ''వేసుకో'' అని చెప్పాడొకసారి. ఆ బాలుడు ఆ షర్ట్ వేసుకుని కృతజ్ఞతాభావంతో చూస్తుంటే, వెజిటబుల్ బర్గరూ, కోక్‌టిన్నూ అతనికి ఇచ్చి వచ్చేసాడు నిశ్శబ్దంగా.

ఎప్పుడూ చలాకీగా ఉంటాడు. వెన్నెల్ని వెన్నలో కలిపినట్టు, చల్లని నిష్కల్మషమైన చిరునవ్వు వాడి పెదవులతో శాశ్వత స్నేహం చేస్తున్నట్టుంటుంది. పక్కఫ్లాట్స్ వాళ్ళు మాన్వితతో చెప్తుంటారెప్పుడూ – ''మీ అమృత్ మహాచురుకండీ, ఒక్క క్షణంకూడా డల్‌గా ఉండటం చూడలేదు మేం'' అని.

ఒకసారి మాన్విత ''అమృత్! నిన్న రాత్రి ఆరుజంతికలు ఈ టిన్‌లో పెట్టాను. పొద్దున్న చూస్తే రెండే ఉన్నాయేంటి?'' అనడిగింది వాడ్ని.

''అరరే, చీకట్లో మిగతా రెండూ కనపడలేదు మమ్మీ...'' అన్న వాడి సమాధానం విని నవ్వాగలేదు మాన్వితకు. క్షణం తర్వాత వాడే అన్నాడు, ''కనపడి ఉంటే, ఆ రెండు కూడా శంకర్‌కే ఇచ్చేవాడ్ని!!'' అని వాళ్ళింట్లో పనిచేసే, సామ్రాజ్యమ్మ ఎనిమిదేళ్ళ కొడుకు శంకర్!!

బి.యస్సీ అగ్రికల్చర్ చదివిన వరప్రసాద్ మిత్రుడొకరు ఊరికి దూరంగా కొంతభూమి లీజుకి తీసుకుని వ్యవసాయం చేస్తుంటే, తల్లిదండ్రులతో కలిసి అమృత్ అక్కడకు వెళ్ళాడొకసారి. అక్కడ పుచ్చకాయల తోట కనిపిస్తే, ''డాడీ! వాటర్ మెలాన్!'' అని అరిచాడు అమృత్ హుషారుగా. అప్పుడు వరప్రసాద్ ''అమృత్! అది అంకుల్‌వాళ్ళది కాదు వేరే వాళ్ళది. ముట్టుకోకు'' అని కొడుకుతో చెప్పాడు. ఆ సమయంలో ఆ పుచ్చతోట ఆసామి అక్కడే ఉన్నాడు. అమృత్ ఆయన దగ్గరకు వెళ్ళి, ఒక పెద్ద పుచ్చకాయని చూపించి, ''ఇదెంత అంకుల్?'' అని అడిగాడు.

''ముప్ఫై రూపాయలు''.

''నా దగ్గర ఐదు రూపాయలే ఉన్నాయి'' అని ఇంకొక చిన్నకాయని చూపి, ''... చిన్నికాయని ఇస్తారా?'' అని అడిగాడు అమృత్.

''సరే తీసుకో'' అన్నాడు ఆయన. అప్పుడు అమృత్, ఆయనకు ఐదు రూపాయలు ఇచ్చేసి చెప్పాడు. ''ఒక నెల తర్వాత వచ్చి తీసుకువెళ్తాను. అప్పటి దాకా నా కాయ జాగ్రత్త!''

అమృత్‌కి సినిమాలంటే ఇష్టం. ముఖ్యంగా హీరో వికాస్ సినిమాలంటే మరీన్నూ. ఎప్పటికైనా తన అభిమాన హీరోని కలిసి, షేక్‌హేండ్ ఇస్తానంటుంటాడు తల్లిదండ్రులతో అప్పుడప్పుడూ!

***

ఒకరోజు రాత్రి, భోజనాలయ్యాక వరప్రసాద్ ఏదో పుస్తకం చదువుతూ హాల్లో ఉన్నాడు అమృత్ తన గదిలో చదువుకుంటున్నాడు. పదిన్నరకు మాన్విత పెట్టినకేకకు తుళ్ళిపడ్డాడు వరప్రసాద్. పుస్తకం వదిలేసి పరిగెత్తుకు వెళ్ళాడు. ''ఏవండీ, అమృత్ గాలి పీల్చడం లేదు'' అంది మాన్విత ఆందోళనగా. అమృత్ ముఖం నీలంగా మారిపోతోందెందుకో. వెంటనే, వరప్రసాద్, కొడుకు నోటిని తన నోటితో మూసి గాలి ఊదాడు. నోటి ద్వారా కృత్రిమశ్వాస. రెండు నిమిషాలతడలా చేసేసరికి అమృత్‌లో శ్వాస

## వివాహాలు ఆడంబరంగా చేయాలని శాస్త్రాల్లో ఉందా?

## సందేహాలు – సమాధానాలు

**1. కాట్రగడ్డ వెంకట్రావ్, పామర్రు**

ప్ర : పురాణ పాత్రలలో చాలామటుకు వావి వరుసలు ఉండవు. ఇలాంటి వాటిని మనం అనుసరించాలా?

స : పుస్తకాలు చదివి, సినిమాలు చూసి పురాణాలను విమర్శించడం కాదు. పురాణ గాథల్లో సన్నివేశాలు, వాటి ధర్మ నిర్ణయాలు తెలుసుకుంటే ఇలాంటి సందేహాలు రావు. విజ్ఞులైన పెద్దలను అడిగితే ఇందులోని ధర్మం మీకు తెలుస్తుంది.

**2. ఆదిలక్ష్మి, హైదరాబాద్**

ప్ర : తన తపస్సుకు భంగం కలిగించాడని శివుడు మన్మథుని భస్మం చేస్తాడు. శివుడు ఎవరి గురించి తపస్సు చేస్తున్నాడు?

స : ఆ సమయంలో శివుడు తపస్సు చేయడం లేదు. ధ్యానముద్రలో ఆత్మానుసంధానం చేస్తున్నాడు. శివుడు సగుణ బ్రహ్మ. తాను నిర్గుణ బ్రహ్మతో అనుసంధానం అవుతున్నాడే తప్ప తపస్సు చేయడం కాదు.

**3. పాపారావ్, తెనాలి**

ప్ర : రామకోటిని రెండుసార్లు రాస్తే అరిష్టమా?

స : పుణ్యఫలం లభించే కార్యాలు ఎన్ని మార్లు చేసినా తప్పు లేదు. రామకోటిని రెండు మార్లు రాయటం వలన విశేష ఫలితం ఉంటుంది. అరిష్టం ఎంతమాత్రమూ కాదు.

**4. ప్రసన్నకుమారి, జగద్గిరిగుట్ట**

ప్ర : వివాహాలు అప్పులు చేసి ఆడంబరంగా చేస్తుంటారు. మన శాస్త్రాల్లో వివాహాలు ఇలానే చేయాలని ఉందా?

స : వివాహాలు ఆడంబరంగా చేయాలని ఏ శాస్త్రంలోనూ లేదు. నేటి సమాజానికి శాస్త్రాల పైన అవగాహన, విశ్వాసం లేదు. అందుకే ఇలాంటి అనర్థాలు తలెత్తుతున్నాయి.

**5. శ్రీకాంత్, విజయవాడ**

ప్ర : శనీశ్వరునికి ఇష్టమైన ప్రసాదాలు ఏవి?

స : శనీశ్వరునికి నువ్వుల ఉండలు అత్యంత ఇష్టం. అలాగే తైలాభిషేకం కూడా.

మీ సందేహాలకు సమాధానాలు ఆశిస్తే మీరడగదల్చుకున్న ప్రశ్నలను కార్డుపై రాసి కింది చిరునామాకు పంపండి

సందేహాలు–సమాధానాలు, నవ్యవీక్లీ, ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, ప్లాట్ నెం. 76, అశ్వనీ లే అవుట్, హుడా హైట్స్, జూబ్లీ హిల్స్, హైదరాబాద్ – 500033

తిరిగి ప్రారంభమైంది.

వెంటనే హాస్పిటల్‌కి తీసుకువెళ్ళారు. డాక్టర్ గుణశేఖర్‌కి అమృత్ తెలుసు. తన నర్సింగ్ హోంలో వాడు పుట్టినప్పటి నుండీ...

పన్నెండేళ్ళ క్రితం –

మాన్విత, అమృత్‌కి జన్మనిచ్చినప్పుడు, తండ్రి అయ్యాడన్న ఆనందంతో వరప్రసాద్ కళ్ళు మెరిసాయి. భర్త కళ్ళల్లోని ఆ ఆనందపుమెరుపుని తృప్తిగా చూస్తూ మాన్విత అడిగింది. "ఎవరి పోలికండీ?" అని. వేలుని తన వేపు తిప్పుకుని గర్వంగా చూసాడు, నావేనన్నట్టు. కాన్పుతాలూకు అలసటతో సైతం అందంగా వెలుగుతోంది మాన్విత ముఖం. సరిగ్గా అప్పుడు ఒక నర్స్ అక్కడకు వచ్చింది. అమృత్‌ని ఎత్తుకుని ట్రాలీమీద ఉంచి ఒక ట్యూబ్‌ని వాడి బుల్లినోట్లోకి జొనిపింది. "లోపల నీరు ఉంది. దానిని తీసేయడానికి"... చెప్పింది ఆ నర్సు. ఆ ట్యూబు బాబు గొంతు లోంచి జారి క్రిందికి వెళ్ళకుండా 'యు' మలుపు తిరిగి బయటకు వచ్చింది! నర్సు నుదురు ముడుచుకోడం వరప్రసాదూ, మాన్వితా ఇద్దరూ చూసారు. మాన్వితలో భయం. భార్య చేతిని గట్టిగా పట్టుకున్నాడు వరప్రసాద్. వెంటనే డాక్టర్ గుణశేఖర్‌ని పిల్చింది నర్సు. ఐదునిమిషాలు పరీక్షించాక తేలింది. అమృత్ TOF బేబీ అన్ననిజం. "మీ బాబుకి' ట్రేకీ ఈసోఫీగల్ ఫిస్ట్యులా' ఉంది ప్రసాదుగారూ..." డాక్టర్ చెప్తున్నారు. "... బాబు ఈసోఫేగస్ విండ్ పైప్‌తో కలిసి పోయింది".

అమృత్ భూమిమీద పడ్డ కొన్నిగంటల్లోనే ఆపరేషన్‌కి ఏర్పాట్లు జరిగి పోయాయి. థియేటర్ బయట వేచి చూస్తున్నాడు వరప్రసాద్. అమృత్ ఈసోఫేగస్ తాలూకు పైభాగాన్ని ట్రేకియా నుండి సర్జికల్‌గా వేరుచేసి దాన్ని ఈసోఫేగస్ క్రింది భాగంతో కలిపి కుట్టేశారు డాక్టర్లు.

ఆ ఆపరేషన్ తర్వాత మరికొన్ని పరీక్షలు జరిపి వివరించాడు డా. గుణశేఖర్ "మీ బాబుకి ఐదో వెన్నెముక సరైన ఆకృతిలో లేదండీ. దీని గురించి పెద్దగా వర్రీ అవ్వక్కర్లేదు గానీ వెన్నుపూస వంకర పోకుండా ఉండేందుకు ఒక ఆపరేషన్ చేయాలి. కష్టమైన ఆటలూ, స్పోర్ట్సూ, వీపుని ఇబ్బంది పెట్టేవీ చేయకుండా జాగ్రత్త తీసుకోవాలి".

మూడు నెలల వరకూ అమృత్ బాగానే ఉన్నాడు. ఆ తర్వాతొకసారి, ఇప్పుడు జరిగినట్లుగానే శ్వాస ఆగిపోయింది. డాక్టర్ పరీక్షించి కార్టిలేజ్ మామూలుకన్నా ఎక్కువమెత్తగా ఉండటంతో గాలి పీల్చినప్పుడు ట్రేకియా సన్నగా మూసుకుపోతోందని గ్రహించాడు.

అప్పుడు, అంటే సరిగ్గా మూడు నెలల వయసులోనే మళ్ళీ ఓ ఆపరేషన్ చేసారు. అమృత్ ఛాతిని తెరిచి గుండె నుండి వెళ్ళే ప్రధాన ధమని (AORTA)ని బ్రెస్ట్‌బోన్‌తో కలిపి కుట్లువేసారు. దాంతే ట్రేకియా మీద ఒత్తిడి తగ్గిపోయి క్రమంగా వయసు పెరిగేకొద్దీ కార్టిలేజ్ గట్టిపడుతుంది.

***

ఈ కేస్ హిస్టరీ అంతా డాక్టర్ గుణశేఖర్‌కి తెల్సు. "ఇప్పుడెలా ఉంది అమృత్?" అనడిగాడు డా. గుణశేఖర్. "అయామ్ ఫైన్ డాక్టర్" అన్నాడు అమృత్ నవ్వుతూ, అంతకుముందు శ్వాస ఆగిన విషయమే గుర్తులేనట్లు "కొన్ని టెస్ట్స్ చేద్దామా?" అనడిగాడు గుణశేఖర్ "ఓ.కే" అంటూ తల ఊపాడు అమృత్, హుషారుగానే!

ఒక ఎక్స్‌రేలో స్పష్టంగా తెలిసింది, వెన్నుపూస వంకర తిరిగి ఉండటం! "దీన్ని కనుక మనం తక్షణం ఆపకపోతే..." డా. గుణశేఖర్ మాన్విత, వరప్రసాద్‌లతో చెప్పాడు"... చాలా తీవ్రమైన వైకల్యంగా మారిపోతుంది. బాబు ప్రక్కటెముకల నుండి ఒక బోన్ గ్రాఫ్ట్ తీసి దాన్ని వెన్నుపూసలోకి ప్రవేశ పెట్టవలసి ఉంటుంది. అప్పుడే, వీపు ఓ వైపుకి ఒరిగిపోవడం ఆగుతుంది".

ఆ దంపతులకు అర్థమైంది. ఆ సర్జరీ ఎంత అవసరమో. ఆ రాత్రి, అమృత్ నిద్ర పోయాక వాళ్ళిద్దరూ చర్చించుకుంటున్నారు.

"వాడు ఇప్పటికే రెండు ఆపరేషన్లు తట్టుకుని బ్రతికాడు. ఇదీ కూడా సవ్యంగానే జరిగిపోతుంది. నువ్ ధైర్యంగా ఉండు మాన్వితా.." చెప్పాడు వరప్రసాద్, 'తనకొడుక్కే ఎందుకిలా అవ్వాలి' అంటూ కుమిలిపోతున్న భార్యను గుండెల్లో దాచుకుంటూ.

***

అమృత్ కూడా ఆపరేషన్‌ని ఒక ఛాలెంజ్‌గా ఎదుర్కోగలనన్నట్లే కనపడ్డాడు. "ఆపరేషన్ అయ్యాక ఒక మూడు నెలల పాటు తల నుండి నడుము వరకూ ఒక ప్లాస్టిక్ క్యాస్ట్ వేసుకోవలసి ఉంటుంది" అని ఆర్థోపెడిక్ సర్జన్ చెప్పినప్పుడు కూడా భయపడలేదు వాడు, సరికదా, సంతోషంగా ఆ క్యాస్ట్ (తొడుగులాంటిది)ని రోజూ రెండు గంటల పాటు ధరించి అలవాటు చేసుకోవడం ప్రారంభించాడు. తర్వాత ఆ క్యాస్ట్‌లోనే పడుకోడం కూడా! ఆఖరికి, వాడు దాన్ని స్కూల్‌కి కూడా వేసుకుని వెళ్ళాడొకసారి గర్వంగా, దాన్ని రాజులు ధరించే కవచంలా ఫీలవుతూ.

తర్వాత ఒకరోజు తెలిసింది మాన్వితకు. అమృత్‌పైకి అలా సంతోషంగా, ధైర్యంగా కనిపిస్తున్నా లోలోపల భయపడుతున్న విషయం. ఇంగ్లీషు నోట్‌బుక్‌లో ఒకపేజీలో వాడువేసిన ఒక బొమ్మ కనిపించింది. దాన్లో ఆపరేషన్ థియేటర్, మాస్కులు ధరించిన డాక్టర్లూ, వాళ్ల చేతుల్లో కత్తులూ, సిరింజిలూ....!!

ఆ బొమ్మక్రింద రాసాడు: మళ్ళీ ఎప్పుడూ హాస్పిటల్‌కి వెళ్ళకుంటే ఎంత బావుణ్ణు!!

***

అమృత్‌కి ఆపరేషన్ చేసేరోజు నిర్ణయించబడింది. ఆరోజు ఉదయం ఎనిమిదిన్నరకు, ఆపరేషన్ థియేటర్‌కి తీసుకువెళ్తుంటే తండ్రిని దగ్గరకు పిలిచాడు అమృత్. "ఏం భయం లేదు నాన్నా. ఎలాంటి ఆపరేషన్నైనా నువ్వు తట్టుకోగలవ్. యు ఆరే ఫైటర్..."

తండ్రి మాటలు విని మృదువుగా నవ్వాడు అమృత్. "డాడీ" నెమ్మదిగా పిలిచాడు.

"చెప్పునాన్నా"

"ఒక వేళ ఆ 'ఫైట్'లో నేనోడిపోతే.."

"ఛ.. ఛ. అలా మాట్లాడకురా అమృత్. నీకేమీ కాదు.." మాన్వితకు దుఃఖం పొంగుకొస్తోంది.

"ఒకవేళ నాకేదైనా ఐతే..." అంటూ తండ్రి కళ్ళల్లోకి చూస్తూ... "... నా కళ్ళను దానం చేసెయ్యండి డాడీ" వాడింకేదీ మాట్లాడకూడదన్నట్టు, చేత్తో వాడి నోటిని మూసేసింది మాన్విత. ఆ మాటంటున్నప్పుడు కూడా అమృత్ నవ్వుతూనే ఉన్నాడు!


ఈడు... జోడు ... అందం... ఐశ్వర్యం
కళ్యాణం ... కాకతీయ!

కాకతీయ మ్యారేజస్ ప్రై. లిమిటెడ్.
103, 109 & 203, విజయశ్రీ అపార్ట్‌మెంట్స్, చర్చ్ వెనుక,
అమీర్‌పేట్, హైదరాబాద్. 500 073.
ఫోన్స్: 040 - 23747777, 9391999999

FREE online Registration & Free search



www.kaakateeya.com
www.telugumarriages.com
www.kannadamarriages.com
www.tamilmarriages.com



అమీర్‌పేట | నెల్లూరు
కూకట్‌పల్లి | తిరుపతి
దిల్‌సుఖ్‌నగర్ | కర్నూలు
విజయవాడ | (చెన్నయ్) టి.నగర్
గుంటూరు | బెంగుళూర్
తెనాలి | సేలం
విశాఖపట్నం | మధురై
రాజమండ్రి | వెల్లూరు
కాకినాడ | తిరుచి
ఖమ్మం | పాండిచ్చేరి
ఈరోడ్
ఒంగోలు | ఏలూరు

చెన్నయ్ (అన్నానగర్), చెన్నయ్ (పోరూర్), (చెన్నయ్) తాంబరం, జయానగర్, కోయంబత్తూరు.

***

ఆపరేషన్ థియేటర్ బయట బల్బ్ వెలుగుతోంది ఎర్రగా.

థియేటర్లో, ఆపరేషన్ నిర్వహిస్తున్న డాక్టర్ గుణశేఖర్, పన్నెండేళ్ళ క్రితం బ్రెస్ట్‌బోన్‌తో కలిపి కుట్టేసిన అయోర్టా (Aorta)ని ప్రక్కకు కదపడానికి ప్రయత్నించినప్పుడు జరిగిందది! ఆ ధమనికి చిన్నరంధ్రం పడింది!! నెత్తురు ఒక్కసారిగా ఎగచిమ్మింది. డాక్టర్ గుణశేఖర్ వెంటనే దాన్ని వేలితో మూసేసాడు. అక్కడున్న డాక్టర్ల బృందంలో అందరి ఊపిరి ఆగింది. కుట్లు వేసేందుకు సరిగా చోటు కుదరడం లేదని, ఆ ధమనిని ఇంకొంచెం వేరు పరచాలని ప్రయత్నించాడు డా. గుణశేఖర్. అంతే! ఆ చిన్ని రంధ్రం ఇంకొంచెం చి...ర...గ...డం... మొదలైంది. ఇప్పుడు ఒకటి కాదు రెండు వేళ్ళు అడ్డుపెట్టాల్సి వస్తోంది రక్తాన్ని ఆపేందుకు. టెక్నీషియన్లు 'గుండె – ఊపిరితిత్తుల మెషీన్'ని స్టార్ట్ చేసారు. అమృత్ ధమనుల్లోకి, సిరల్లోకీ రక్తాన్ని పంప్ చేయడానికి. ఇప్పుడీ మెషీనే వాడి కోసం శ్వాసిస్తోంది! కానీ, ఆ మెషీన్ పూర్తిస్థాయిలో పని చేయడానికి ముందే, అమృత్ రక్తపోటు వేగంగా పడిపోయింది. దాంతో కొన్ని నిమిషాల పాటు వాడి మెదడుకి ఆక్సిజన్ అందలేదు!

థియేటర్ బయట, భార్యచేతిని గట్టిగా పట్టుకుని, 'అంతా బాగానే జరుగుతుంది. వాడికి మెడికల్ ఎమర్జెన్సీస్ కొత్తేమీ కాదు' అంటూ పాజిటివ్‌గా ఆలోచిస్తున్నాడు వరప్రసాద్.

కానీ–

మెదడు అన్నిటికంటే సున్నితమైన అవయవం. రక్తం అందకపోటంతో, దానికి రక్తాన్ని చేరవేసే 'కాపిల్లరీలు' బ్రేక్‌డౌన్ కావడం మొదలుపెట్టాయి. రక్త ప్రసారం తిరిగి ప్రారంభమయ్యేసరికి, బలహీనపడి వున్న సన్నటి ఆ రక్తనాళాల గోడలు 'లీక్' అవసాగాయి!

ఇప్పుడిక రక్తమూ, ద్రవాలూ, అమృత్ మెదడులోకే 'వొలికి' పోతున్నాయి.

తలలో వొత్తిడి పెరిగిపోతోంది.

అప్పుడిక డాక్టర్ గుణశేఖర్ బయటకు వచ్చి వరప్రసాద్‌ని, పక్కకు తీసుకు వెళ్ళి చెప్పాడు.

''చాలా సీరియస్ కాంప్లికేషనొకటి వచ్చింది. మాకు సాధ్యమైనదంతా చేసాం. గేజెస్ అన్నీ అమృత్ బ్రెయిన్ మరణిస్తుందనే సంకేతా లిస్తున్నాయి. మీ బంధువులందరికీ తెలియచేయండి. బాబు ఆఖరి కోరికేదైనా ఉంటే..''

ఆ మాట వినగానే దుఃఖమాగలేదు వరప్రసాద్‌కి. ''మాన్వీ! రా త్వరగా... వాడిక మనకు లేనట్లేనంటున్నారు..'' అంటూ బేలగా భార్యను పిలిచాడు. ఆ దంపతులిద్దరూ ఒకర్నొకరు పట్టుకుని చాలాసేపు గుండెలు అవిసేలా ఏడ్చారు. దుఃఖాన్ని దిగమింగుకుంటూనే, అమృత్ బెడ్ దగ్గరకు వచ్చారు వాళ్ళిద్దరూ. వాడికళ్ళు తల్లితండ్రుల్నిద్దర్నీ చూస్తున్నాయి. అసలిక్కడ ఏమీ లేదు. కాంతి, చైతన్యం ఏదీ లేదు!

''బాధపడకండి డాడీ! మమ్మీ ప్లీజ్ ఏడవద్దు...'' అన్న భావాన్ని వెలిబుస్తున్నట్లు ఉంది అమృత్‌చూపు.


పైకి ధైర్యంగా, సంతోషంగా నవ్వుతున్నా ఏ అదృశ్యశక్తో వాడికి చెప్పేస్తున్నట్టుంది, 'ఒక వేళ ఆ ఫైట్‌లో నేనోడిపోతే...' అన్నాడందుకే.

''బాబు ఆఖరి కోరికేదైనా ఉంటే..''

డాక్టర్ గుణశేఖర్ ఇందాక చెప్పిన మాట గుర్తొచ్చింది వరప్రసాద్‌కి.

**నేనూ, అమృత్.**

అన్నపూర్ణ స్టూడియోలో వేసిన ఓ ప్రత్యేకమైన సెట్‌లో విలన్‌తో జరిగే ఓ కీలకమైన పోరాట సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్నప్పుడు ఫోన్ వచ్చింది నాకు సంయుక్త నుండి.




''చెప్పు సంయుక్తా'' అన్నాను ఫోన్లో.

''మీరొక చిన్నసాయం చేయాలండీ'' అంది సంయుక్త.

''సాయమా? ఏంటి?'' అన్నాను భృకుటి ముడిచి.

''మేక్ ఎ విష్ ఫౌండేషన్ వాళ్ళనుండి ఇప్పుడే ఫోన్ వచ్చింది...''

''వాళ్ళకేదైనా డొనేషనా...'' ఫౌండేషన్ అన్న మాట వినగానే ఏదో విరాళా లివ్వడం లాంటి వ్యవహారమనుకుని వ్యంగ్యంగా అడిగాను.

''మీరు ఎప్పుడూ, ఎవ్వరికీ, ఏదీ, 'ఇ...వ్వ..రు' అని నాకు తెల్సు. అదికాదు. అమృత్ అనే ఓ చిన్నికుర్రాడు మీకు వీరాభిమానట. ఆ బాబిప్పుడు చనిపోయే ఆఖరిక్షణాల్లో ఉన్నాడు హాస్పిటల్లో. మిమ్మల్ని ప్రత్యక్షంగా చూసి, షేక్‌హేండ్ ఇవ్వాలని అంటుండే వాడట ఎప్పుడూ. మనమొకసారి అక్కడికి వెళ్దాం'' చెప్పింది సంయుక్త. ఆమె కంఠంలో ధ్వనించే బాధ, ఆ పిల్లవాడి కోరిక తీర్చాలనే ఆమె తపన నన్నొక్కక్షణం ఆలోచింపచేసాయి. ''అక్కడొక టెన్ మినిట్స్ ఉంటే చాలు కదా..'' అన్నాను. ఆ పిల్లవాడి మీద కనీసజాలి కూడా చూపనందుకూ, 'అసలేమైంది బాబుకి?' అని ఒక్కమాటకూడా అడగనందుకు తను నొచ్చుకుంటుందని నాకు తెల్సు. సినిమాకి తీసుకునే పారితోషికంగానీ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యాపార ప్రకటన్లో నటించినందుకు లభించేది గానీ లెక్కవేస్తే, 'నిమిషానికి' నా ఆదాయం లక్షల్లో ఉంటుంది! అంత విలువైన నా పది నిమిషాల సమయాన్ని 'ఉచితంగా' ఇవ్వడమే గొప్ప అన్నభావం నాది!!

***

ఇద్దరం కలిసి హాస్పిటల్లో అమృత్‌ని కలిసాం. మేక్ ఎ విష్ ఫౌండేషన్‌కి సంబంధించిన ఒక వాలంటీరు కూడా అక్కడ ఉన్నాడు.

''అమృత్! నాన్నా! చూడు నీ కోసం ఎవరొచ్చారో..'' అంటూ కొడుకు బెడ్ దగ్గరకు చేరి చెప్తున్నాడు వరప్రసాద్. అమృత్ తల నుండి బెడ్ పక్కనున్న ఒక మెషీన్‌ని కలుపుతూ వైర్లు. అక్కడి ఇండికేటర్స్‌లో కొన్నిమాత్రం అతని మెదడు పని చేస్తూనే ఉందని చూపుతున్నాయి. అక్కడి 'మూడ్'కీ తగ్గట్టుగా నా హావభావాల్ని మార్చేసాన్నేను.

నాలోని నటుడికి అది బాగా తెలిసిన విద్యే కదా. టీవీ కెమెరాలకీ, చుట్టూ చూసే వాళ్ళకో సమే ఆ 'నటన'. లోపల మాత్రం, నా సమయం వృధా అవుతోందన్న విసుగే!! నేను ప్రా...క్టి...క...ల్ మనిషిని!

అమృత్ కనురెప్పలు మెల్లగా ఎత్తిచూసాడు. ఎదురుగా నేను కనపడగానే ఆ కళ్ళల్లో కనిపించీ కనిపించని వెలుగు. నాలోని 'హీరో' ఆ వెలుగుని గుర్తించాడు. ఒక అహం చల్లారిన భావన నాలో. అమృత్‌ని చూసి నవ్వాను. అదొక ప్లాస్టిక్ నవ్వు! సంయుక్త మాత్రం బాధగా చూస్తోంది అమృ

త్ని. 'దగ్గరకు వెళ్ళి, అతన్ని తాకండి' అన్న అర్థం వచ్చేలా నన్ను పొడిచింది మోచేత్తో. నేనప్పుడు అమృత్‌కి చేరువగా వెళ్ళి మరో కాస్మెటిక్ నవ్వుని పండించి, అమృత్ చేతిని నా చేతుల్లోకి తీసుకున్నాను షేక్‌హాండ్ ఇస్తున్నట్లు. చల్లటి వాడి చేతి వేళ్ళు, నా అరచేతిని గట్టిగా నొక్కిపట్టుకున్నాయి. ఆ స్పర్శతో, ఎన్నో వేలభావాల్ని, కొండంత తన అభిమానాన్నీ, నాలోకి వొంపుతున్నట్టుగా చాలా గట్టిగా పట్టుకున్నాడు.

"వికాస్ గారూ! మీరంటే వాడికి ఎంతో ఇష్టం సార్. మీ సినిమాలన్నిటి లోకీ 'గరికపూలు' అంటే మరీ ఇష్టం. ఎందుకనో ఆ సినిమాని నాలుగైదుసార్లు చూసాడు. అందులో మీ డైలాగులన్నీ వాడికి కంఠతా వచ్చు. ముఖ్యంగా అందులో మీరుచెప్పిన ఒక వాక్యం ఎప్పుడూ చెబుతుండాడు. **'Your worth is not measured by what you have, but by what you give'** ఈ మాట వాడికి ప్రేరణట" పైట చెంగుతో కన్నీళ్ళు ఒత్తుకుంటూ చెప్పింది మాన్విత.

నేను అదిరిపడ్డాను. ఆవిడా మాటల్ని మామూలుగానే చెబుతున్నా నాకు మాత్రం నన్ను వేలెత్తి చూపుతున్నట్లనిపించింది. పది నిమిషాల కంటే ముందే అక్కడినుండి వచ్చేసాను.

***

ఆ తర్వాత, రెండు గంటల్లో పరిస్థితి అనూహ్యంగా మారిపోయింది. వరప్రసాద్‌నీ, మాన్వితనూ ఒక గదిలోకి తీసుకువెళ్ళాడు డా. గుణశేఖర్. వాళ్ళిద్దరూ ఊపిరి బిగపట్టారు. "ప్రసాద్ గారూ..." డాక్టర్ కంఠం స్పష్టంగా పలికింది. "... ఇప్పుడే కొన్ని పరీక్షలు చేసాం. వాటి ప్రకారం, యువర్ సన్ ఈజ్ బ్రెయిన్ డెడ్.." గాఢమైన నిశ్శబ్దం అలుముకుంది అక్కడ. ఆ దంపతులిద్దరూ చాలాసేపు ఏమీ మాట్లాడలేకపోయారు. భార్యవంక చూసాడు వరప్రసాద్. ఇద్దర్లోనూ ఒకటే ఆలోచన. "డాక్టర్! .." వరప్రసాద్ చెప్పాడు. ".... మేం అమృత్ అవయవాల్ని డొనేట్ చేయాలనుకుంటున్నాం.."

సాయంత్రం 4.30 గంటలు. కొడుకు అవయవాల్ని దానం చేసేందుకు వీలు కల్పించే పేపర్ల మీద సంతకం చేసాడు వరప్రసాద్.

తర్వాత, రెడ్‌క్రాస్ సొసైటీకి చెందిన ట్రాన్స్‌ప్లాంట్ కో ఆర్డినేటర్ ఒకరు వరప్రసాద్‌కి వివరించారు. అమృత్ శరీరంలోంచి గుండెని, ఊపిరితిత్తుల్ని, కిడ్నీలనీ వెలికితీసి ఆపరేషన్ గురించి.

"... ట్రాన్స్‌ప్లాంట్ టీం బాడీని చాలాగౌరవప్రదంగా చూస్తుందండీ. అవయవాల్ని రిసీవ్ చేసుకునే రోగినెంత జాగ్రత్తగా చూస్తామో, డొనేట్ చేసే వాళ్ళనీ అంతే జాగ్రత్తగా చూస్తాం".

ట్రాన్స్‌ప్లాంట్ టీం సభ్యులంతా వచ్చాక సర్జరీకి తీసుకువెళ్తున్న అమృత్‌తో బాటు వరప్రసాద్ మాన్విత ఇద్దరూ వెళ్ళారు – ఆఖరిసారిగా. ట్రాలీ

## మానవతా విలువకి అసలైన కొలమానం



'ది జాయ్ ఆఫ్ గివింగ్' కి పరాకాష్ఠ ఏమిటో చూపాలన్న తపనే ఈ కథకు ప్రేరణ. 'నీకు ఎంత ఉంది' అన్నది కాదు 'ఎంత ఇ...చ్చా...వ్' అనేదే నీలోని మానవతా 'విలువ'కి అసలైన కొలమానం అనే సూక్తి ఆధారంగా అల్లుకున్న ఈ కథలో 'ఇవ్వడం'లోని హాయిని పరిపూర్ణంగా ఆస్వాదించిన ఓ 'చిరంజీవి' జీవితాన్ని ఆవిష్కరించాను.

జీవితం నుండి శాశ్వతవీడ్కోలు తీసుకోడాన్ని కూడా మధురంగా మలచుకో గలగడమన్నది చాలా గొప్పవిషయం. దీన్నికూడా ఈ కథలో చూపించే ప్రయత్నం చేసాను. నా ఈ ప్రయత్నానికి బహుమతినిచ్చి తగిన గుర్తింపునందించిన 'నవ్య'కూ, సీ.పీ బ్రౌన్ అకాడమీకి కృతజ్ఞతలు.

**-గుమ్మడి రవీంద్రనాథ్**

***98660 41012***

మీద తీసుకుపోతున్నారు వాడ్ని! ఆ ట్రాలీ వేగంతో సమానంగా నడుస్తూ వాడి లేత చేతిని పట్టుకున్నాడు వరప్రసాద్. చేత్తో పట్టుకునే వీలున్న రెస్పిరేటర్‌తో గాలిని అమృత్ ఊపిరితిత్తుల్లోకి పంప్ చేస్తున్నాడొక డాక్టర్. అమృత్‌లోని మిగతా అవయవాల్ని స..జీ..వం...గా ఉంచుతున్న ఒకే పరికరం ఆ రెస్పిరేటరే. స్ప్రింగ్ డోర్‌లోంచి వాడ్ని లోపలికి తోసుకు వెళ్ళాక, వాళ్ళిద్దరూ బయటే మిగిలిపోయారు. అప్పుడొక డాక్టర్ వచ్చి, "అమృత్ బెడ్‌క్రింద ఈ పేపర్ ఉందండీ" అంటూ ఒక కాగితాన్నీ దాంతో పాటూ జలుబుకి వేసే మాత్రలూ మాన్విత కిచ్చాడు.

ఒక ఉద్వేగంతో ఆమె 'ఆ పేపర్‌ని తెరిచింది: అందులో అమృత్ చేతి రాతలో ఉన్నా అక్షరాలు:

"మమ్మీ! ఎక్కువసేపు ఏడిస్తే నీకు జలుబు చేస్తుంది కదా?! ఈ టాబ్లెట్స్ వేసుకో".

***

రెండు నెలల తర్వాత–

ఏర్‌కండిషన్డ్ జిమ్‌లో ఫిట్‌నెస్ ట్రైనర్ పర్యవేక్షణలో వ్యాయామాలు చేసి వచ్చి సోఫాలో సేద తీరుతుంటే నా దగ్గరకొచ్చి ఒక పత్రిక నా ఒళ్ళో పడేసింది. సంయుక్త. అది 'ప్రభాత్' అనే ప్రఖ్యాత ఆంగ్ల మాస పత్రిక "ఏంటిది?" అన్న నా ప్రశ్నకు బదులుగా, ఆ పత్రిక పేజీలు తిప్పి, ఒక చోట రాసి ఉన్నదాన్ని చూపించింది, చదవమన్నట్టు.

'అమృత్స్ గిఫ్ట్' అన్న హెడ్డింగ్‌తో వేసిన రెండు పేజీల వ్యాసం అది.

నిశ్శబ్దంగా చదవసాగాను.

అమృత్ పాన్‌క్రియాస్ కణాలతో ఇన్సులిన్ ఉత్పత్తి అందేలా చేయడం ద్వారా డయాబెటిక్ కోమా నుండి బయటపడి కొత్త జీవితం పొందిన సుజాత అనే 16 ఏళ్ళ యువతి ఫొటో వేసారు.

అలాగే, అమృత్ గుండెతోనూ, ఊపిరి తిత్తులతోనూ ప్రాణం పోసుకున్న సాత్విక్ అనే ఓ పసివాడి వివరాలూ ఆ వ్యాసంలో ఉన్నాయి. రెడ్‌క్రాస్ వారి ద్వారా వరప్రసాద్‌కి పంపబడిన ఓ లేఖలోని కొన్ని వాక్యాల్ని అందులో పొందుపరిచారు. తీవ్రమైన కిడ్నీ వ్యాధితో బాధపడిన ఓ మధ్య వయసు వ్యక్తి రాసిన లేఖది:

"... మీ కుటుంబం నాకు ప్రసాదించిన అమూల్యమైన కానుకతో నాకో కొత్తజీవితం లభించింది. అందులోని ప్రతిదినం నాకు అత్యంత విలువైనదే. ఇంతటి మహోపకారానికి ప్రతిగా ఏమిచ్చినా అతి స్వల్పమే. కృతజ్ఞతాభావంతో నిండిపోయిన గుండెకు అన్ని మాటలూ కరువైనప్పుడు కేవలం రెండే రెండు మిగిలి ఉంటాయ్. థాంక్ యు!"

మాన్విత చెప్పిన మాటల్ని ఆ వ్యాసం ముగింపు వాక్యాలుగా రాసారు. అవి:

"... అమృత్ జ్ఞాపకం నా కెప్పుడొచ్చినా, లేక రోడ్డు మీద ఎక్కడైనా వాడి వయసు పిల్లలెవరైనా కనపడినా, కళ్ళలోంచి ఓ నీటి చుక్క జారిపోతుంది. కొందరి బ్రతుకులు వెలిగించేందుకు అమృత్ సాయపడ్డాడు అన్న స్పృహ నా వేదనను తగ్గిస్తుంటుంది.

ఈ లోకంలో అన్నింటికంటే అత్యంత విలువైన బహుమతి ఇచ్చాడు నా అమృత్. ది గిఫ్ట్ ఆఫ్ లైఫ్! అది కూడా ఎవరికి?! తను అంతకు ముందెప్పుడూ చూడని, తనకే మాత్రం తెలీని వ్యక్తులకి!!"

అది చదివాక నా మనసంతా ఏదో అయిపోయింది. ఒక ఇబ్బందికరమైన భావన. సంయుక్త నా కళ్ళల్లోకి సూటిగా చూస్తోంది. ఒక చిన్నపిల్లవాడు, మరణించాక కూడా ఇతరుల కోసం ఏదో ఒకటి 'ఇవ్వాల'ని తహతహ లాడడాన్ని, ఎప్పుడూ, ఎవ్వరికీ, ఏమీ ఇవ్వని నా సంకుచితత్వంతో పోల్చి చూపెడుతున్నట్టుంది ఆమె చూపు!

ప్రపంచంలోనే అతి ఎత్తైన బుర్జ్‌దుబాయ్‌లో ఇల్లు కొనుకున్నా, ఇవ్వడం లోని 'కిక్'ని సంపూర్ణంగా అనుభవించిన ఆ పసివాడు, 'నేనందుకోలేనంత ఎత్తు'లో ఉన్నాడనిపించిందినాకు.

'హీరో'ని నేనా? వాడా?

ఎవరు నిజమైన 'స్టార్'?

ప్రశ్న తొలుస్తోంది...

సమాధానమూ తె...లు...స్తోం...ది!!

*